


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 21-6-2025

సంపుటి: 21 సంచిక: 76

పేజీలు: 8 వెల: రూ.1





- వార్డెన్లకు గత డీడీ విశ్వమోహన్‌రెడ్డి షాక్
- ఇష్టారాజ్యంగా బదిలీ జాబితా తయారీ
- ఆయనపై ఫిర్యాదులున్నా చర్యలు నిల్
- ఎదురు ఫిర్యాదులతో బాధితులకు బెదిరింపులు




## సిఫార్సులకు చెల్లుచీటీ..
# బదిలీలకు వెలకట్టి!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మంత్రుల సిఫార్సులు చెల్లలేదు.. జేసీ సూచనలకూ విలువలేదు.. ప్రభుత్వ మార్గదర్శకాలూ అమలు కాలేదు. వెరసి సాంఘిక సంక్షేమ శాఖలో పలువురు వార్డెన్లకు సాధారణ బదిలీల్లో షాక్ తగిలింది. దీనికి కారణం.. ఇటీవలి బదిలీపై ఏలూరుకు వెళ్లిపోయిన ఆ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి నిర్వాకమే. మాజీ ఐఏఎస్ అధికారి ధనంజయరెడ్డి సిఫార్సుతో జిల్లాకు వచ్చి నాలుగేళ్లు ఇక్కడే తిష్ట వేసిన విశ్వమోహన్‌రెడ్డి బదిలీపై వెళ్తూ వెళ్తూ పలువురు వార్డెన్లను ఇష్టారాజ్యంగా బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. సాధారణ బదిలీల్లో సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోకుండా, కౌన్సెలింగ్ చేయకుండానే పలువురు వార్డెన్ల పేర్లను బదిలీ జాబితాలో చేర్చేసి తాను బదిలీపై వెళ్లిపోయారు. ఆయన ఇచ్చిన జాబితానే ఉన్నతాధికారులు కళ్లు మూసుకొని ఆమోదించేశారు. రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇచ్చిన సిఫార్సు లేఖలను విశ్వమోహన్‌రెడ్డి పరిగణనలోకి తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు మంత్రుల పేషీనుంచి సమాచారం వెళ్లినా వారూ స్పందించలేదని తెలిసింది. కొందరు మహిళా వార్డెన్లు గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి విన్నవించుకోగా, ఆయన డీడీ విశ్వమోహన్ రెడ్డిని పిలిపించి సదరు మహిళా వార్డెన్ల గ్రీవెన్స్‌కు అనుగుణంగా బదిలీ చేయాలని సూచించారు. దాన్ని కూడా డీడీ పట్టించుకోలేదు.




సీనియారిటీ ప్రకారం బదిలీ కోరుతూ చేసుకున్న అర్జీ




మంత్రి అచ్చెన్నాయుడు కార్యాలయం ఇచ్చిన సిఫార్సు లేఖ

### నాలుగేళ్లలో ఎన్నో ఆరోపణలు

సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటి నుంచే విశ్వమోహన్‌రెడ్డి జిల్లా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఏలూరు జిల్లాకు చెందిన ఒక మంత్రితో చెప్పించుకుని బదిలీ చేయించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వెళ్లిపోతానన్న ధీమాతోనే ఎవరి సిఫార్సులు, రిక్వెస్టులను ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా బదిలీ జాబితా రూపొందించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ కావాల్సిన సీనియర్ల నుంచి డబ్బులు దండుకుని, వారిని కాకుండా జూనియర్లపై బదిలీ వేటు వేశారని పలువురు వార్డెన్లు ఆరోపిస్తున్నారు. టెక్కలి, నరసన్నపేటలకు చెందిన మహిళా వార్డెన్లు వయస్సు, ఆరోగ్య రీత్యా తమను బదిలీ

- మిగతా చివరి పేజీలో



## కుమారుడిని బలిగొన్న
# భార్యాభర్తల కలహం!

- భర్తతో తరచూ గొడవలతో మనస్తాపం
- బిడ్డతో సహా నదిలో దూకిన తల్లి
- ఆమెను రక్షించిన స్థానికులు
- విగతజీవిగా మిగిలిన కొడుకు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

భార్యాభర్తల కలహాలు అభం శుభం తెలియని వారి కుమారుడిని బలి తీసుకున్నాయి. భర్తతో గొడవ పడిన భార్య తన కుమారుడితో సహా ఆత్మహత్యకు చేసిన ప్రయత్నంలో ఆమె బతికి బట్టకట్టగలిగినా.. కుమారుడు అశువులు బాశాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న యాతపేట చెందిన తుమ్మల యేసుబాబుకు పెద్ద రెల్లివీధికి చెందిన మేనకోడలు విమలతో నాలుగున్నరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండున్నరేళ్ల వరుణ్‌తేజ్ అనే కుమారుడు ఉన్నాడు. యేసుబాబు సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని కొనుగోలు చేసి, తానే స్వయంగా నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. అయితే అతను నిత్యం మద్యంసేవించి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా

- మిగతా లోపలి పేజీలో

# యోగాను సైన్సు
# ఎందుకు అంగీకరించదు?



- డా. దేవరాజు మహారాజు
ప్రముఖ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

**కొన్నేళ్ల క్రితం వరకూ శారీరక శ్రమకు చాలా విలువ ఉండేది. పొలాలకు వెళ్లడం, మోట కొట్టడం, నాగలి దున్నడం, పశువులు మేపడం.. వంటి ఏ పని తీసుకున్నా అది శారీరక శ్రమతో కూడుకున్నదే! గృహిణులు ఇంటి పనులే కాకుండా వ్యవసాయ పనులు కూడా చేసేవారు. వడ్లు దంచడం, పిండి విసరడం వంటివన్నీ శారీరక శ్రమలే! అవన్నీ జీవన శైలిలో అంతర్భాగంగా ఉండేవి. ప్రత్యేకంగా వ్యాయామం చేయడం ఉండేది కాదు. పరిశ్రమలు పెరిగి, యంత్రాలు వచ్చి శారీరక శ్రమం స్థానంలో బుద్ధిబలానికి విలువ పెరుగుతున్నకొద్దీ వ్యాయామం అవసరమైంది. ఆటలు అవసరమయ్యాయి. అందుకే అన్ని రకాల వ్యాయామాల్ని, జిమ్నాస్టిక్స్‌ని, ఆటల్ని, క్రీడల్ని సైన్సు ఆమోదించింది. ముక్కు మూసుకుని చేసే ధ్యానాన్ని, యోగాను, సమాధిని సైన్సు అంగీకరించలేదు.**

> “ ‘థండర్ బోల్ట్’ అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్‌లు తప్పనిసరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్లు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దానివల్ల మోకాళ్లు ఒత్తిడికి గురై నాడులూ, జాయింట్స్ దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులూ కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది.
>
> - డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్, నీ రిప్లేస్‌మెంట్ సర్జన్ ”



ఆటలతో, క్రీడలతో శారీరక శ్రమ లభిస్తుంది. శారీరక శ్రమతో జీవన క్రియలన్నీ ప్రారంభమవుతాయి. ప్రారంభమైనవి వేగాన్నందుకుంటాయి. దాంతో శరీర గ్రంథులూ, మెదడూ అవసరమైన రసాయనాల్ని విడుదల చేస్తాయి. ఫలితంగా శరీరంలో కణస్థాయి నుంచి అన్ని వ్యవస్థలలో చురుకుదనం పెరిగి మనిషి ఆరోగ్యవంతుడవుతాడు. ఆనందాన్ని అనుభవిస్తాడు. వేగంగా నడవడాన్ని, ఈత కొట్టడాన్ని, సైకిల్ తొక్కడాన్ని, కర్రసామును, జిమ్‌లోని అనేక వ్యాయామాల్ని జీవశాస్త్రం - వైద్యశాస్త్రం ఒప్పుకుంది. ప్రోత్సహించింది కూడా. మరీ చిన్నపిల్లలయితే ఆటపాటలతో పాటు అనందంగా విద్య నేర్చుకునే వసతి ఉండాలని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తన శాంతినికేతన్‌లో ఆ ఏర్పాట్లు చేశారు. ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మతధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి వాటి స్థానాలేమిటో బోధపడుతుంది.

యోగాను ప్రతిపాదించిన పతంజలి ‘యోగః చిత్తవృత్తి నిరోధకః’ అని అన్నాడు. అంటే యోగ ఆలోచనల్ని స్థంభింప జేస్తుందని అర్థం! అంతే కాదు. యోగ మోక్షానికి మార్గమనే చెప్పాడు పతంజలి - అంతేకాని, ఆరోగ్యసాధన కోసం ఇది పనికొస్తుందని చెప్పలేదు. ఇటీవలి కాలంలో ఆధునిక యోగా గురువులు వారి వారి ఆలోచనల్ని జోడించి, జనాన్ని మభ్యపెడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఆధునిక వ్యాపార గురువులు యోగ కాన్సర్‌నీ, ఎయిడ్స్‌నీ కూడా తగ్గిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పతంజలి - యోగాను ప్రతిపాదించిన కాలానికి కాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులు గుర్తించబడలేదు. యోగ ఈ వ్యాధుల్ని తగ్గిస్తుందంటే మరి నిరూపణ ఏదీ? వారి దగ్గర నిరూపణ ఏదీ లేదని కూడా మనకు తెలుసు. అయినా కూడా వారు పెట్టే ‘చెవిలో పువ్వుని’ భక్తితో పెట్టించుకుని, వారి పిట్టకథలు వింటూ ఉండాలని వారి కోరిక! యోగాతో సర్వరోగాలూ మటుమాయం అయ్యే మాటైతే.. నిత్యం యోగాను పాటించిన రామకృష్ణ పరమహంస, రమణ మహర్షులను కాన్సర్ ఎందుకు కబళించింది? నేటి కాలంలో యోగా గురువుగా ప్రసిద్ధుడైన రాందేవ్ బాబా మోకాళ్ల ఆపరేషన్ కోసం విదేశాలకు ఎందుకు వెళ్లినట్టూ? మనకు మనం ఆలోచించుకోవలసిన విషయాలు.




(జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం)

‘యోగ’ - అంటే వ్యాయామం అనే అర్థం కూడా ఉంది కదా? మరి దాన్ని తీసుకుంటే తప్పేమిటి? అనేవారు కొందరుంటారు. దేహదారుఢ్యానికి ఉపయోగపడే పరేడ్ సైనికులకు, ఎన్‌సీసీ కాడెట్‌లకు ఉంటుంది. స్కూలు పిల్లలకు డ్రిల్ పీరియడ్ ఉంటుంది. యోగ ఇలాంటి శారీరక వ్యాయామాల కిందికి రాదు. వైద్య రంగంలో ‘ఫిజియోథెరపీ’ ట్రీట్‌మెంట్ ఉంది. ఏ రోగికి ఎలాంటి వ్యాయామం అవసరమో, అది ఎంత కాలం చేయాల్సి ఉంటుందో వైద్య నిపుణులు నిర్ణయిస్తారు. జిమ్స్‌లో కూడా ట్రైనర్లు ఉంటారు. మీ ధ్యేయమేమిటో తెలుసుకుని, మీకు ఎలాంటి వ్యాయామం అవసరమో వారు అలాంటివి నిర్ధారిస్తారు. చెప్పుకోవాల్సింది ఏమంటే వ్యాయామానికి ఒక ధ్యేయం ఉంటుంది. ఏం కావాలనుకుంటున్నాం - ఏం సాధించాలనుకుంటున్నాం అనేదాని మీద ఎక్సర్‌సైజ్ ప్రోగ్రాంలుంటాయి. వైవిధ్యభరితంగా ఇన్ని ఆటలు, క్రీడలు, వ్యాయామాలు ఉండగా యోగా ఎందుకు? దానివల్ల ఒనగూరే ప్రయోజనమేముందీ? అనేది సీరియస్‌గా ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. చదువుల్లో కూడా అంతే కదా? మనం ఏం కావాలనుకుంటున్నామో, దాన్ని బట్టే కోర్సులుంటాయి.

డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్ మోకాలి చిప్ప మార్పిడి చేసే ప్రత్యేక నిపుణుడు (నీ రిప్లేస్‌మెంట్ సర్జన్). ఆయన చెప్పిన విషయాల్ని ‘ద డెయిలీ టెలిగ్రాఫ్’ ప్రకటించింది. న్యూఢిల్లీకి చెందిన డీన్ నెల్సన్ కూడా కొన్ని వివరాలు అందించాడు. ఈ భారతీయ వైద్య నిపుణులు ఇచ్చిన వివరాలను, వివరణలను బట్టి మనం తెలుసుకోగలిగేది ఏమంటే.. చాలామంది యోగా గురువులు మోకాలి చిప్ప మార్పిడి కోసం సర్జరీ చేయించుకున్నవారే! ఇంకా చాలామంది ఇప్పటికీ సర్జరీ లైన్లో నిలబడుతున్నవారే. ‘థండర్ బోల్ట్’ అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్‌లు తప్పనిసరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్లు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దానివల్ల మోకాళ్లు ఒత్తిడికి గురై నాడులూ, జాయింట్స్ దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులూ కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది. ఈ విషయం మీద ఇంటర్‌నెట్‌లో చాలా సమాచారం ఉంది. కావల్సిన వాళ్లు వెతుక్కోవచ్చు. మరో ముఖ్య విషయమేమంటే ఈ యోగా గురువులు ఎవరికీ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఏమాత్రం ఉండదు. ఇష్టం వచ్చినట్టుగా కాళ్లూ, చేతులూ, మెడ, భుజాలు వంచి విచిత్రమైన భంగిమలలో జనాన్ని ఆకర్షిస్తుంటారు.

యోగా వల్ల కీళ్లనొప్పులు వస్తాయని, ముందే నొప్పులు ఉన్నవారికి అవి అధికమౌతాయనీ ఆర్థోపెడిక్ డాక్టర్లు వివరణ ఇస్తున్నారు. వెన్నెముకను విల్లులా

- మిగతా లోపలి పేజీలో



> “ అసలు మనిషి నిటారుగా నిలబడాలంటేనే.. వెన్నెముక బలంగా ఉండాలి. శరీరాన్ని నిలబెట్టాలి. మనిషి బరువంతా కాళ్లమీద, నడుము మీద, వెన్నెముక మీద ఉంటుంది. ఆవు, గేదె, పులి, పిల్లి వంటి జంతువుల్లాగా కాదు. ఆ జంతువు వెన్నెముక భూమికి సమాంతరంగా ఉంటుంది. బరువంతా నాలుగు కాళ్ల మీద ఉంటుంది. మనిషికి ఆ వసతి లేదు. మనిషి వెన్నెముక భూమికి నిటారుగా ఉంటుంది. మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి తొంభయి డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమ్యాకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. ”

• ఎడిటోరియల్

# యోగాంధ్ర సాధనకు ఇదే మార్గమా?

రాష్ట్ర ప్రభుత్వం అనుకున్నది సాధించింది. విశాఖ మహానగరం వేదికగా సరికొత్త రికార్డుతో గిన్నెస్ బుక్‌లోకి ఎక్కింది. సాగరతీరంలో ఏకంగా రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి వరకు సుమారు 26 కిలో మీటర్ల పొడవునా 3.1 లక్షల మందితో యోగాసనాలు వేయించడం ద్వారా ఈ రికార్డు సృష్టించింది. గతంలో సూరత్ నగరంలో 1.47 లక్షల మందితో నిర్వహించిన యోగా కార్యక్రమమే రికార్డుగా ఉండేది. దానికి రెట్టింపు జనాలతో యోగా చేయించడం ద్వారా ఏపీ సర్కారు కొత్త రికార్డు నమోదు చేసింది. ప్రతి ఒక్కరితో క్యూర్ కోడ్ స్కాన్ చేయించడం ద్వారా హాజరైనవారి సంఖ్యను పక్కాగానే లెక్కించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ ఈ మహాసంరంభాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లను ప్రశంసలతో ముంచెత్తారు. ఆ విధంగా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైనట్లే. కానీ ఈ కార్యక్రమం ద్వారా సాధించిందేమిటి? దీన్ని ప్రభుత్వమే తన భుజస్కంధాలపై వేసుకుని కోట్లకు కోట్లు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేసి, ప్రభుత్వ యంత్రాంగానికి టార్గెట్ల పేరుతో పీక మీద కత్తి పెట్టి, రాజకీయ సభలకు మాదిరిగా ప్రజలను బలవంతంగా తరలించాల్సిన అవసరం ఏముంది? అన్న ప్రశ్నలు, విమర్శలు చెలరేగుతున్నాయి. అసలు యోగాతో పాటు ఆధ్యాత్మిక, మతపరమైన కార్యక్రమాలను ప్రభుత్వం స్వయంగా పూనుకుని నిర్వహించవచ్చా? ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు, రాష్ట్రంలో, దేశంలో ఎన్నెన్నో వ్యవస్థలు, సంస్థలు ఉన్నాయి. కానీ వాటన్నింటినీ కాదని ప్రభుత్వమే స్వయంగా పూనుకుని వంద కోట్లకుపైగా ప్రజాధనాన్ని ఓ గంట కార్యక్రమానికి వెచ్చించడం ఎంతవరకు సమర్థనీయమన్న చర్చ జరుగుతోంది. దానికి బదులు కార్యక్రమ నిర్వహణను సంబంధిత సంస్థలకు అప్పగించి, అందుకు తగిన వాతావరణాన్ని కల్పించవచ్చు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే జనాన్ని, దానివల్ల ఉత్పన్నమయ్యే ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించడానికి, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాల్లో తగు చర్యలు చేపట్టవచ్చు.. పర్యవేక్షించవచ్చు. అలా కాకుండా ప్రభుత్వమే ప్రత్యక్షంగా ఇలాంటి వాటిలో భాగస్వామి కావడం, స్వయంగా వాటి నిర్వహణను, వాటి ప్రచారాన్ని తలకెత్తుకోవడం వల్ల ప్రభుత్వం నిర్వర్తించాల్సిన అసలు విధులకు ఆటంకం కలుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం మీద అదనపు భారం పడుతుంది. యోగాంధ్ర నిర్వహణ విషయంలో సరిగ్గా అదే జరిగింది. దాదాపు నెల రోజులుగా మంత్రుల నుంచి కిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల వరకు అందరినీ ప్రభుత్వం ఈ పనులకే నియోగించింది. జన సమీకరణ, రవాణా, ఆహారం, తాగునీటి సౌకర్యాల కల్పన వంటి బాధ్యతలకు సంబంధించి పైనుంచి కిందివరకు టార్గెట్లు పెట్టి రోజూ వెంటాడింది. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనులు పడకేశాయి. అందరూ యోగాంధ్రకే అంకితమయ్యారు. పనుల కోసం ప్రజలు ఏ కార్యాలయానికి వెళ్లినా యోగాంధ్ర తర్వాత రండి.. అనే సమాధానమే వినిపించింది. మరోవైపు ఈ కార్యక్రమ నిర్వహణకు రూ. 100 కోట్లకుపైగానే ఖర్చయినట్లు సమాచారం. ఒక్క విశాఖ జిల్లా యంత్రాంగమే యోగాంధ్ర ఏర్పాట్లకు రూ.62 కోట్లు అసవరమని ప్రతిపాదనలు పంపగా, రాష్ట్ర ప్రభుత్వం అందులో తొలివిడతగా రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇవి కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలన్నింటికీ జనసమీకరణ, ఇతర ఏర్పాట్లకు భారీగానే ఖర్చయింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావద్భారతదేశం నిర్వహించింది. అందులో ప్రధానమంత్రి పాల్గొన్న ప్రధాన కార్యక్రమం విశాఖలో జరిగింది. యోగాను కేంద్రం కూడా ప్రమోట్ చేస్తున్నందున జాతీయస్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్రం కూడా నిధులు ఇవ్వాల్సి ఉంది. కానీ ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అయితే యోగా అన్నది మానవాళి ఆరోగ్యానికి ఉపకరించే ప్రక్రియ అని.. దాన్ని ప్రమోట్ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ మాత్రం చర్యలు తీసుకోవడంలో తప్పులేదని ప్రభుత్వాలు, పాలకపెద్దలు వాదించవచ్చు.. తమ చర్యలను సమర్థించుకోవచ్చు. అందులో కొంత నిజం ఉండవచ్చు. కానీ యోగా ప్రయోజనాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సైన్స్ ఇప్పటికీ దీన్ని ప్రామాణికంగా గుర్తించడం లేదు. యోగా మన సనాతన ఆరోగ్య సాధన ప్రక్రియే కావచ్చు. దాన్ని విరివిగా వినియోగంలోకి తేవాలంటే ఒక్కరోజు.. వందల కోట్లు పోసి కార్యక్రమాలు నిర్వహిస్తే సరిపోదు. ఆ ఒక్కరోజుతో దాన్ని అందరూ మర్చిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల దాన్ని విద్యాసంస్థల్లో ఒక క్లాసుగా పెట్టి, డ్రిల్లు మాదిరిగా సాధన చేయిస్తే ఎటువంటి ఖర్చు, శ్రమ లేకుండానే యోగా మన జీవనంలో భాగంగా మారుతుంది.

# యోగాను సైన్సు ఎందుకు అంగీకరించదు?

(మొదటిపేజీ తరువాయి)

వెనకకు వంచడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మనిషి వెన్నెముక ముందుకు వంగడానికి అనువుగా నిర్మాణమై ఉంది. మరి అందుకు విరుద్ధంగా వెనకకు వంచడమంటే రిస్కు తీసుకోవడమే కదా? నడుముకు పై భాగాన ఉన్న అవయవాలు అన్నీ వెన్నెముక ఆధారంగా నిలబడి ఉన్నాయి. అసలు మనిషి నిటారుగా నిలబడాలంటేనే.. వెన్నెముక బలంగా ఉండాలి. శరీరాన్ని నిలబెట్టాలి. మనిషి బరువంతా కాళ్లమీద, నడుము మీద, వెన్నెముక మీద ఉంటుంది. ఆవు, గేదె, పులి, పిల్లి వంటి జంతువుల్లాగా కాదు. ఆ జంతువు వెన్నెముక భామికి సమాంతరంగా ఉంటుంది. బరువంతా నాలుగు కాళ్ల మీద ఉంటుంది. మనిషికి ఆ వసతి లేదు. మనిషి వెన్నెముక భూమికి నిటారుగా ఉంటుంది. మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి 90 డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమ్యాకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. బాల్యం నుండే ఆసనాలు అభ్యాసం చేసేవారి విషయం వేరు. మధ్యవయస్సులో, వృద్ధాప్యంలో ప్రారంభించేవారు సమస్యలు ఎదుర్కోక తప్పదు. ప్రతివాడూ మల్లయోధుడో, సర్కస్ కళాకారుడో కానవసరం లేదు. ప్రతి జీవికి కొన్ని సౌలభ్యాలుంటాయి. కొన్ని అవరోధాలు ఉంటాయి. వాటిని గమనించుకుంటూ జీవించడం మంచిది.

ప్రాణాయామంలో గట్టిగా శ్వాస పీల్చి, వదిలేయాల్సిన గాలిని, అంటే కార్బన్ డై ఆక్సైడ్‌ను వదిలివేయకుండా ఎక్కువ సేపు ఊపిరి తిత్తుల్లో బలవంతంగా ఆపడం జరుగుతుంది. అది మంచిది కాదని నిపుణులు చెపుతారు. ఎక్కువ ఆక్సిజన్ పీల్చుకుంటే ఆరోగ్యం చేకూరుతుంది. కానీ కార్బన్ డై ఆక్సైడ్ సత్వరం వదిలేయాల్సిన వాయువు. శరీరంలోని జీవన క్రియల్ని నిర్వర్తించడానికి మొత్తానికి మొత్తంగా శారీరక ధర్మాల్ని పర్యవేక్షించడానికి మెదుడుకు ఎక్కువ రక్తం అవసరమౌతుంది. శరీరానికి అందే ఆక్సిజన్‌లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది. యోగా చేసేప్పుడు మెదడుకు తగినంత ఆక్సిజన్ అందదు. అందుకే మెదడు స్తబ్దుగా అయిపోయి, భ్రమలు కలగడం ప్రారంభమౌతాయి. అలాగే సుష్టుగా భోజనం ముగించాక చూడండి ఒళ్లంతా బరువుగా, బద్ధకంగా, స్తబ్దుగా ఉంటుంది. అలా ఎందుకూ అంటే – జీర్ణాశయం నిండిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ మొత్తంలో రక్తం జీర్ణవ్యవస్థకు చేరుతుంది. ఫలితంగా మెదడుకు ఆక్సిజన్, రక్తప్రసరణా తాత్కాలికంగా తగ్గుతాయి. కాలో, చెయ్యో తిమ్మిరెక్కడం అలాంటిదిదే – రక్త ప్రసరణలో అంతరాయమే – యోగ, ధ్యానం చేయడం వల్ల, సమాధిలోకి పోవడం వల్ల జరుగుతున్నదీ అదే! ఆలోచనల్ని అరికట్టి, మెదడును మొద్దుబారించి, భ్రమల్లోకి, కల్పనల్లోకి పోవడమే!

'శ్వాస మీద ధ్యాస' అని చెపుతారు కొందరు. అంటే ఏమిటీ? కళ్లు మూసుకుని, శ్వాస మీద ధ్యాస పెట్టి ఇష్టదైవాన్ని తలచుకోవడం. అట్లా అట్లా భ్రమల్ని ఊహల్ని పెంచి పోషించుకుని దైవదర్శనమైందని సంతృప్తిని పొందవచ్చు. ఈ ఐహిక బంధాల్లోంచి బయటపడి ఒక స్థాయికి ఎదిగి తపస్సు చేస్తే – ఆధ్యాత్మికశక్తిని సాధించగలమని సాధువులు చుపుతుంటారు. అసలు విషయమేమంటే మెదడుకు తగినంత ఆమ్లజని అందక, కలిగే భ్రమలే అవి! మనకు సాధువులు, మహర్షులు ఉన్నారు. ఇన్ని వేల ఏళ్లలో వీరిలో ఎవరైనా తపస్సు చేసి, వాస్తవంగా దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకున్నారా? తమ దేవుణ్ణి పక్కవారికి ఎవరికైనా చూపించి పరిచయం చేశారా? లేదే. మెదడును పనికిరాని పదార్థంగా మార్చుకోవడం గొప్పపని కాదు. దాన్ని నిరంతరం వాడుతూ కొత్త కొత్త అన్వేషణలు, ఆవిష్కరణలు చేయడమే మనిషి ధ్యేయం కావాలి. చురుకైన అవయవాన్ని మరింత చురుకుగా చేసుకోవడమే విజ్ఞుల పని!

**'జ్ఞాన సాధన పేరుతో మెదడును తిమ్మిరెక్కించి, భ్రమల్లో తేలిపోయి, దివ్య లోకాల సందర్శనం అంటూ, దైవదర్శనమయ్యిందనే భ్రమలో జనానికి తప్పుడు సమాచారమిచ్చేవారిని పిచ్చివాళ్ల కింద జమకట్టాలి. మహానుభావులెప్పుడూ తోటివారికి పనికొచ్చే పని చేస్తారు. తమను తాము వ్యర్థులుగా మార్చుకునే ప్రక్రియలు చేపట్టరు. జనానికి తప్పుడు దారులు చూపంచరు. వాస్తవంలోనే భవ్యమైన భవితకు దారులు వేస్తారు.**

# కుమారుడిని బలిగొన్న భార్యాభర్తల కలహం!



(మొదటిపేజీ తరువాయి)

వారిద్దరు గొడవ పడ్డారు. దీంతో శనివారం ఉదయం విమల తన కుమారుడితో సహా గుడివీధి సమీపంలో నాగావళి నదిలోకి దూకేసింది. ఆ పక్కనే పిండ ప్రదాన కార్యక్రమం చేస్తున్నవారు గమనించి విమలను రక్షించి బయటకు తీసుకొచ్చారు. కానీ ఆమె కుమారుడు మాత్రం లభించలేదు. స్థానికుల సాయంతో నదిలో గాలించగా చివరికి విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఒకటో పట్టణ ఎస్ఐ రామారావు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి తల్లి విమల కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయిందని, చికిత్స కూడా తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికీ భర్తతో గొడవ పడుతుండేదని చెబుతున్నారు.

# యోగాతో జీవితం ఆనందమయం




(సత్యంన్యూస్, లావేరు)

యోగాతోనే జీవితం ఆనందమయంగా ఉంటుందని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో యోగ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని వర్గాల ప్రజలు మానసిక ప్రశాంతత లేకుండా ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారని, ఇలాంటి సమయంలో ప్రతిఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగాసనాల ద్వారా మానసిక శాంతి, ఏకాగ్రత పెంచుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు యోగా బాగా చేసినట్లయితే ఏకాగ్రతతో పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించగలరన్నారు. ఈ సందర్భంగా పద్మాసనం, వజ్రాసనం, తాడాసనం, వృక్షాసనంతో పాటు సూర్య నమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాగోలేదని చెప్పలేం.. అద్భుతం అనలేం!







(కుబేర సినిమా రివ్యూ..)

**ధనవంతుల అత్యాశకు, పేదవాళ్ల ఆకలికి మధ్య జరిగే సంఘర్షణకు దృశ్య రూపమే ఈ చిత్రం. భిన్న ధ్రువాలైన ఈ ఇద్దరి వ్యక్తుల జీవితాలు ఒకదానితో ఒకటి ఎలా ముడిపడ్డాయి? వాళ్ల మధ్య సంఘర్షణ ఎందుకు తలెత్తిందనేది ఆసక్తికరం.**

**కథ**

గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్ఫ్) ప్రపంచ ధనవంతుడిగా నిలవాలనేది జీవితాశయం. తన గ్లోబల్ అజెండాతో, కేంద్ర ప్రభుత్వ 'ఆపరేషన్ సాగర్' ప్రాజెక్ట్‌ను తన స్వలాభం కోసం వాడుకోవాలనుకుంటాడు. అందుకోసం రాజకీయ నాయకుడు సిద్ధప్పతో రూ.లక్ష కోట్ల బ్లాక్ అండ్ వైట్ డీల్ కుదుర్చుకుంటాడు. అయితే లక్ష కోట్లు చేతులు మారటం అంటే సామాన్యమైన విషయం కాదు కదా. అందుకే ఈ భారీ లావాదేవీని ఏ ఇబ్బంది లేకుండా పర్‌ఫెక్ట్‌గా నిర్వహించేందుకు జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జున) సహాయాన్ని తీసుకుంటాడు. అందుకోసం దీపక్‌ని జైలు నుంచి బయిటకు తెస్తాడు. దీపక్ తన ఆట మొదలెడతాడు. తన మాస్టర్ మైండ్ ప్లాన్‌తో నలుగురు బిచ్చగాళ్లను సెట్ చేసి, వారి పేరిట విదేశాల్లో ఫేక్ కంపెనీలు, అకౌంట్లు సృష్టించి డబ్బు ట్రాన్స్‌ఫర్ ప్లాన్ చేస్తాడు. అయితే డీల్ పూర్తికాగానే, బిచ్చగాళ్లను ఖతం చేయాలన్న నీరజ్ ప్లాన్. అంతా సవ్యంగా జరుగుతుంది అనుకున్న టైమ్‌లో ఒక్క దేవా(ధనుష్) మాత్రం తప్పించుకుంటాడు. ఇప్పుడు దేవాని స్విస్ అకౌంట్‌లో ఉన్న రూ.10వేల కోట్ల కోసం నీరజ్–దీపక్ గ్యాంగ్ చుట్టుముడుతుంది. అప్పుడు ఏమైంది.. దేవా నిజంగా బిచ్చగాడేనా? అతని గతం ఏమిటి? దీపక్ అతనికి సహాయం చేశాడా, మోసం చేశాడా? సమీరా (రష్మిక) అతని జీవితంలో ఎలా ప్రవేశించింది? ఆ డబ్బుతో చివరికి దేవా ఏం చేశాడు? ఈ మల్టీ–లేయర్డ్ నెరేషన్‌లో ఎలా పావులు మారతాయి, ప్లాన్లు ఎలా పాముల్లా మలుపులు తిరుగుతాయి.. ధన బలం ముందు మానవ విలువలు నిలబడతాయా అన్న ప్రశ్నకు తెరపై సమాధానం లభిస్తుంది.

**'కుబేర'** స్క్రీన్‌ప్లే పరంగా ఒక అర్బన్ పొలిటికల్ థ్రిల్లర్. ఈ సినిమా కథలో అసలైన బ్యూటీ.. పొలిటికల్ కరప్షన్, కార్పొరేట్ ప్రాబల్యంతో జాతీయ వనరుల దోపిడి, లార్జ్–స్కేల్ మనీ లాండరింగ్, మానవ జీవితాల విలువను లెక్కచేయని వ్యవస్థలపై విమర్శ. అలాగే బిచ్చగాళ్లను బినామీలుగా ఉపయోగించి లక్ష కోట్ల స్కీమ్‌ను నడిపించడం అన్నది కథలోని అద్భుతమైన, ఒరిజినల్ కాన్సెప్ట్. ఇది కథను థ్రిల్లర్ టోన్‌తో ప్రారంభించడమే కాకుండా, సామాజిక అసమానతల్ని చక్కగా చూపిస్తుంది.

అయితే ఈ ఎత్తుగడ ఎంత నీట్‌గా డిజైన్ చేసారో.. అందుకు పూర్తి వ్యతిరేకంగా మిగతా ట్రీట్మెంట్ నడుస్తుంది. శేఖర్ కమ్ముల తన గత సినిమాల లాగానే క్లైమాక్స్‌లో తాత్వికతను కలపాలని ప్రయత్నిస్తూ, కథను అవసరం లేని దిశగా సాగదీయటం కనిపిస్తుంది. ముఖ్యంగా రిపిటేటివ్ ఎపిసోడ్లు, డైలాగ్ బరువు, మెసేజ్ ఓవర్‌డోస్ అనిపించేలా ఉంటుంది. కథలో లోతు ఉంది. దాన్ని స్పష్టంగా అందించే కథనం లేదు.

కథను టైట్‌గా కట్ చేయకపోవటం ఇబ్బంది పెట్టింది. టెక్నికల్‌గా శేఖర్ కమ్ముల కథ కొత్తగా ఉంది కానీ, స్క్రీన్‌ప్లేని నడిపించిన తీరు కథకు తగ్గ స్థాయిలో లేదు. అయితే బలమైన పాత్రలు మాత్రం బాగా రాసుకున్నారు. శేఖర్ కమ్ముల సినిమా అంటే పాటలు రిలీజ్‌కు ముందే సూపర్ హిట్. అవే థియేటర్‌కు ఓపినింగ్స్ రప్పిస్తాయి. అయితే దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్‌లో ఆ మ్యాజిక్ మిస్సైంది. అయితే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగుంది. సినిమాటోగ్రఫీ కూడా చాలా సహజంగా ఉంది. ఎడిటింగ్ పరంగా.. సెకండాఫ్ చాలా భాగం ట్రిమ్ చేసి రన్ టైమ్ తగ్గిస్తే బాగుండేది. ప్రొడక్షన్ వాల్యూస్ ఖర్చు తెరపై బాగా రిచ్‌గా కనిపిస్తోంది.

శేఖర్ కమ్ముల మార్క్ షాట్స్ చాలాచోట్ల పలకరిస్తాయి. ఈసారి కొత్తదనం పేరుతో శేఖర్ కమ్ముల పూర్తిగా మాయమయ్యాడు. అర్బన్ థ్రిల్లర్ నేరేషన్‌లో కథ చెప్పాలనేది శేఖర్ కమ్ములకు ఇష్టమేమో కానీ ఎందుకనో పూర్తిస్థాయిలో ఆకట్టుకోలేదు. బాగోలేదని చెప్పలేం కానీ అద్భుతం అని మాత్రం అనలేం.

కథలో విషయముంది. కథనం రాసుకున్న తీరు కూడా ఆసక్తిగొలిపేలా ఉంది. అయితే పూర్తి రసాస్వాదన కలగడానికి నిడివి పెద్ద అడ్డమయ్యింది. మూడుగంటల పైచిలుకు నిడివి గల సినిమాలు వస్తున్నాయి, ఆడుతున్నాయి. కానీ సాగదీస్తున్నట్టు అనిపించకుండా ఉన్నప్పుడే వాటి ఫలితం ఆశాజనకంగా ఉంటుంది. ఆ విషయంలో కొంత జాగ్రత్త తీసుకుని ఉండాల్సింది. ప్రథమార్ధంలో చాలాసేపు గ్రిప్పింగ్‌గా నడిచింది. పాయింట్ టు పాయింట్ కన్విన్సింగ్‌గా అనిపిస్తూ వచ్చింది. ఓపెనింగ్ సీన్లోనే కథ తాలూకు మెయిన్ పాయింట్ ఎస్టాబ్లిష్ అయిపోవడం, కాంఫ్లిక్ట్ పాయింట్ కూడా త్వరగానే రావడం వల్ల ఎంగేజింగ్‌గా అనిపించింది. కానీ రష్మిక ఎంట్రీ సీన్ నుంచి కథ టెంపో మారడం, వెంటనే ఇంటర్వెల్ పడకపోవడంతో లెంగ్దీగా అనిపించింది. మళ్లీ సెకండాఫ్ కథ టేకాఫ్ బాగుంది. కానీ కథ ముందుకు వెళ్తున్నా కూడా అక్కడక్కడే నడుస్తున్న ఫీలింగొస్తుంది. అయితే ఉన్నంతలో రష్మిక ట్రాక్ కాస్త రిలీఫ్ ఇచ్చింది. 'క్షణక్షణం'లో శ్రీదేవి తరహా కేరెక్టర్ ఆర్క్ ఆమెది. తన ప్రమేయం లేకుండా అనుకోకుండా పెద్ద సమస్యలో ఇరుక్కున్న అమాయకురాలి పాత్ర.

కంటెంట్ మీద మమకారంతో ఎడిటర్‌ని పూర్తిగా వాడుకోలేదో లేక కట్ చేయడానికి వీల్లేదని ఎడిటరే చెప్పారో తెలీదు కానీ సినిమా లెంగ్దీగా అనిపించడానికి వీళ్లిద్దరూ బాధ్యులే. ఈ అప్‌లు, డౌన్‌లు పక్కనపెడితే ధనుష్ తన పాత్రలో జీవించాడు. అమాయకత్వం, మంచితనం, ఉన్నంతలోనే తెలివిని వాడే విధానం, చదువు లేకపోయినా జ్ఞాపకశక్తితో ముందుకు వెళ్లడం లాంటి గుణాలన్నీ చాలా నేచురల్‌గా పెర్‌ఫామ్ చేసాడు. నాగార్జునది పాజిటివ్ షేడ్ ఉన్న నెగటివ్ పాత్ర. పర్యవసానాల వల్ల, అనుభవాల వల్ల, అవసరాల వల్ల, భయం వల్ల ఒక పాజిటివ్ బ్యూరోక్రాట్ నెగెటివ్‌గా మారితే ఎంత ప్రమాదమో ఈ పాత్ర ద్వారా చూడొచ్చు. ఈ తరహా పాత్ర ఆయనకి బాగా నప్పింది. ఇలాంటివి ఇంకా చేయొచ్చు. జిం షర్భ్ విలన్‌గా ఆకట్టుకున్నాడు.




చెప్పుకోదగ్గ సన్నివేశాలు, గుర్తుండే షాట్లు కొన్ని ఉన్నాయి. బిచ్చగత్తెకి పుట్టిన పిల్లవాడి చేతులతో విలన్‌కి బిచ్చమేయించే సీన్ నిజంగా హత్తుకుంది. అలాంటి పొయెటిక్ మూమెంట్స్ ఇంకొన్ని బలంగా ఉంటే బాగుండేది. కాస్త నిడివి తగ్గి ఉంటే ఈ చిత్రం ఇంకొంచెం పైస్థాయిలో ఉండేది.

## మనందరి జీవితాల్లో యోగా భాగమై ఉండాలి



(సత్యంన్యూస్, పలాస)

ప్రజలంతా ఆరోగ్యంగా, శాంతియుతంగా ఉండాలని రోజూ 20–30 నిమిషాలు యోగా చేస్తే ప్రతిఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యవంతంగా ఉంటారని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వర రావు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సందర్భంగా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణతో కలిసి ఆయన పాల్గొన్నారు. యోగా అనే దివ్యమైన ప్రక్రియను భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిందని, దీనిని ప్రతిరోజు జీవితంలో భాగంగా మార్చుకుంటే, శారీరకంగా కూడా మానసికంగా కూడా ఆరోగ్యాన్ని పొందడం సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం యోగాలో పాల్గొన్న వారితో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ హాస్పిటల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఇతర గవర్నమెంట్ సిబ్బంది, టీడీపీ సీనియర్ నాయకులు, కృష్ణార్జున యువ సైన్యం సభ్యులు, మరియు యువకులు పాల్గొన్నారు.



విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్‌లో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని యోగా చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్య కర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## యువత పోరుబాటను విజయవంతం చేయండి

**ఈనెల 23న జిల్లా కలెక్టరేట్ వద్ద పోరుబాట**

**డిమాండ్లతో కూడిన వినతి పత్రం కలెక్టర్‌కు అందజేత**

(సత్యంన్యూస్, నరసన్నపేట)

వైకాపా నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి సర్కారుపై నిరసన గళం తెలియజేసే ఈ కార్యక్రమం యువజన విభాగం ఆధ్వర్యంలో జరుగుతుందని, నాలుగు మండలాల నుంచి యువత అధిక సంఖ్యలో హాజరై యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఈ విషయంపై శనివారం నరసన్నపేట పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు, మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి వృధాను అరికట్టాలి



(సత్యంన్యూస్, రేగిడి)

తాగునీటి వృధాను అరికట్టాలని ఎంపీపీ దార అప్పలనరసమ్మ అన్నారు. శనివారం మండలంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా నీరు–మీరు కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు వీలుగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు.ఈ సందర్భంగా నీరు–మీరు ప్రతిజ్ఞ, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెంనాయుడు, ఎంపీడీఓ శ్యామలకుమారి, తహసీల్దార్ బి ఈశ్వరరావు,పంచాయతీ విస్తరణాధికారి వివి సత్యనారాయణ, ఎమ్ఈఓ వరప్రసాదరావు, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, ఏపిఓ హరనాథ్, ఏపిఎమ్ గోవింద రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవంను పురస్కరించుకొని కళాశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు,యోగ చేయడంవలన మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యంగా ఉంటారన్నారు,యోగ ను ప్రపంచ దేశాలకు భారత దేశం పరిచయం చేసిందన్నారు కాబట్టి అలాంటి యోగాను మనమందరం రోజూ కూడా అభ్యసన చేయాలన్నారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం

యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని 15 వ డివిజన్ ఇంచార్జ్ ఇప్పిలి తిరుమలరావు పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యోగాను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం భారత దేశం అంతటా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. శ్రీకాకుళం నగరం స్థానిక కత్తిరి వీధి దగ్గర గల అవతార్ మెహర్ బాబా సెంటర్ వద్ద అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలతో యోగ చేయించారు. ఈ సందర్భంగా పురవీదుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరికి అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకునే విధంగా ప్రతిపాదించారన్నారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175మంది మద్దతు ఇచ్చారన్నారు. యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. యోగా ఒత్తిడిని తగ్గించడానికి, శక్తిని పెంచడానికి, బలాన్ని పెంచడానికి, ఏకాగ్రతను మెరుగుపరచడానికి, నిద్ర నాణ్యతను పెంచడానికి సహాయపడుతుందన్నారు. అంతేకాకుండా, యోగా రోగనిరోధక శక్తిని పెంచడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో



కూడా సహాయపడుతుందని పేర్కొన్నారు. యోగాసనాలు కండరాలను బలోపేతం చేయడానికి, మెటబాలిజం పెంచడానికి, భంగిమను మెరుగుపరచడానికి సహాయపడతాయన్నారు. రోజూ యోగా సాధన చేయడం వల్ల మానసిక స్థితిని తక్షణమే మెరుగుపరుస్తుందన్నారు. ఇది శరీరానికి రిఫ్రెష్ శక్తిని ఇస్తుందన్నారు. రోజూ యోగా చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుందన్నారు. ఇది శరీరంలో ఆక్సిజనేషన్‌ను ఎనేబుల్ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నెల రోజుల పాటు పండగలా జిల్లాలో యోగా చేశారన్నారు. చివరి రోజు విశాపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగాలో ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిధిగా పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించారన్నారు . ఈ కార్యక్రంలో రమణ, లక్ష్మి, ధర్మారావు,మోహనరాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎంజీఆర్

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

విశాఖ ఆర్కేబీచ్‌లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, మంత్రులు, సహచర శాసనసభ్యులతో కలిసి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ యోగ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. అదేవిధంగా శారీరక శక్తిని సమకూర్చడంతోపాటు మానసిక ప్రశాంతతను చేకూరుస్తుందన్నారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగ అన్నారు. యోగా అంటే కేవలం ఆసనాలే కాదన్నారు. యోగ అంటే మన జీవన విధానాన్ని, జీవితాన్ని క్రమశిక్షణను అలవరుస్తుందన్నారు. దీనిని గమనించి ప్రతి ఒక్కరూ యోగాను ప్రతిరోజూ తమ జీవనంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.



ఇంటర్నేషనల్ యోగ డే సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు తోణంగి వెంకన్నయాదవ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ యోగ చేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరారు.

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



## యువత పోరుబాట విజయవంతం చేయండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా శ్రీకాకుళం అసెంబ్లీ కార్యాలయంలో శనివారం శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు గుండ హరీష్ ఆధ్వర్యంలో యువత పోరుబాట పొస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు పాల్గొని మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ తెలుగుదేశం కూటమి సర్కారుపై నిరసనగళం తెలియజేసే ఈ కార్యక్రమం యువజన విభాగం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుండి విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కళింగ కమిటీ అధ్యక్షులు అందుబాటు సూరిబాబు,శ్రీకాకుళం రూరల్ మండలం ఎంపీపీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు, గార మండల ఎంపీపీ గొండు రఘురాం, పార్టీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రౌతు శంకరరావు, గార మండల పార్టీ అధ్యక్షులు పీస గోవిందరాజులు (గోపి) సానివాడ ఎంపిటిసి రుప్ప అప్పలసూరి, తంగి అప్పన్న, ఊటపల్లి కృష్ణారావు భరద్వాజ్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఎచ్చెర్ల స్థానిక జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో జిల్లా పోలీసులు యోగ ఆసనాలు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల పిలుపు మేరకు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఎచ్చెర్ల స్థానిక జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది యోగాసనం కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహంగా యోగ ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం పరిపాలన అధికారి (ఏ.వో) సిహెచ్ గోపీనాథ్ సిబ్బంది ఉద్దేశించి మాట్లాడుతూ యోగ ప్రక్రియ దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలని, ప్రతి యోగ ఆసనానికి ఒక ప్రత్యేకత ఉంటుందని,నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతిరోజు యోగాకు కొంత సమయాన్ని కేటాయిస్తే మనలో ఉన్న ఒత్తిడి తగ్గించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, అర్ఎస్ఐ హర్‌నాథ్, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా గోడపత్రికను శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యువత తమ బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాల వలన నాశనం చేసుకోవద్దన్నారు. తక్షణమే దీనిపై అవగాహన పెంపొందించాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతుంటే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## యోగ సాధనతో ఆరోగ్యప్రద జీవితం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిత్య జీవితంలో యోగా సాధనను భాగంగా చేసుకుంటే మానసిక ప్రశాంతత, శారీరక శక్తి సంతులనం దక్కుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు, యోగా శిక్షకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాంద్రంగి మురళీకృష్ణ శిక్షణలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతనెల 21 నుంచి జిల్లాలో 6,500 ప్రదేశాల్లో యోగాసనాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సామాన్యులు నుంచే కాక మత్స్యకారుల ప్రాంతాలు, పర్యాటక క్షేత్రాల్లోనూ పెద్దఎత్తున శిక్షణలు ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవర్చుకొని ఆరోగ్యాంధ్ర వైపు సాగాలన్నారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడులను ఎదుర్కొనడానికీ, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా కీలకమని పేర్కొన్నారు. పూర్వీకులు ఇచ్చిన యోగా అనే సంపదను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆరోగ్యమే నిజమైన ధనం ఆరోగ్యాంధ్ర దిశగా ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



**పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

ప్రతి నెల మూడో ఆ శనివారం నిర్వహిస్తున్న 'స్వచ్ఛ్ ఆంధ్ర -స్వర్ణాంధ్ర' కార్యక్రమం భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వయంగా వాడేసిన వాటర్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు డస్ట్ బిన్‌లో వేసి ఆదర్శంగా నిలిచారు. "పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత. ఒకరిని చూసి మరొకరు ప్రేరణ పొందాలి" అని ఆయన అన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్టీఓ ఇతర అధికారులు కూడా శుభ్రత కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమాలలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు బి.శాంతిశ్రీ, జిల్లా వైద్యాధికారి డా. కె. అనిత, నెహ్రూ యువ కేంద్రం ఉపసంచాలకులు వెంకట్ ఉజ్వల్, ఆయుష్ శాఖ వైద్యులు జగదీష్, ఉత్తమరాజ్ రాణా, యోగా శిక్షకులు, సాధకులు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# సిఫార్సులకు చెల్లుచీటీ.. బదిలీలకు వెలకట్టి!

(మొదటిపేజీ తరువాయి)

చేయవద్దని వేడుకున్నా, ఉన్నతాధికారులు సదరు మహిళా వార్డెన్ల రిక్వెస్టులను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించినా పట్టించుకోలేదు. డీడీ విశ్వమోహన్‌రెడ్డి సర్వీస్ మొత్తం పనిష్మెంట్స్‌తోనే నిండిపోయింది. పనిచేసిన ప్రతిచోటా ఆయనపై ఫిర్యాదులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం షరా మామూలే. జిల్లాలో నాలుగేళ్లుగా పనిచేస్తున్న విశ్వమోహన్‌రెడ్డిపై వార్డెన్లు, నాలుగో తరగతి ఉద్యోగులు కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. వీరితో పాటు దళిత సంఘాల నాయకులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తానని నగదు తీసుకున్నట్టు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

**ఎదురు ఫిర్యాదులు**

కాగా తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ తనపై ఫిర్యాదు చేసిన వారిపైనే డీడీ విశ్వమోహన్‌రెడ్డి పోలీసులకు ఎదురు ఫిర్యాదులు చేశారు. అయితే ఫిర్యాదు చేసిన వ్యక్తులు టీడీపీ అనుబంధ విభాగాలకు చెందినవారు కావడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. డీడీపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతిని కలెక్టర్ నియమించారు. ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్వమోహన్‌రెడ్డినే ఎదురుగా కూర్చోబెట్టి బాధితులను విచారించడం విచారణపై ప్రభావం చూపింది. దానికితోడు నోటీసులు ఇవ్వకుండానే.. అదీ కొందరిని మాత్రమే విచారణకు పిలిపించినట్లు తెలిసింది. దీనిపై బాధితులు నిలదీయగా నగదు ఇచ్చినట్టు ఆధారాలుంటే ఇవ్వాలని సూచించి పంపించేశారు. నరసన్నపేట కళాశాల హాస్టల్ వార్డెన్ తారకేశ్వరరావు మాత్రం ప్రమోషన్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని లిఖిత పూర్వకంగా ఆధారాలతో సహా విచారణాధికారికి వివరించారు. కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడానికి ముందు డీడీ విశ్వమోహన్‌రెడ్డి విచారణాధికారి పద్మావతిని కలిసి తాను ఎవరి నుంచీ నెలవారీ వసూళ్లకు పాల్పడలేదని చెబుతూ కొందరు వార్డెన్లతో సంతకాలు చేయించిన లేఖను ఆమెకు అందించారు.

**విచారణ బుట్టదాఖలు**

డీడీ అక్రమాలపై విచారణ నివేదిక ఇచ్చి 40 రోజులు గడిచినా ఇప్పటికీ అది వెలుగు చూడలేదు. డీడీపై చర్యల్లేవు. ఇంతలోనే సాధారణ బదిలీల ప్రక్రియ మొదలుకావడంతో రాజకీయ సిఫార్సుతో విశ్వమోహన్‌రెడ్డి ఏలూరు జిల్లాకు డీడీగా వెళ్లిపోయారు. వెళ్లేముందు నిబంధనలు, సిఫార్సులను ఖాతరు చేయకుండా కౌన్సెలింగ్ నిర్వహించకుండా తనకు నచ్చినట్టు బదిలీ జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఆ ప్రకారమే బదిలీలు జరిగాయి. విశ్వమోహన్‌రెడ్డి బదిలీపై వెళ్లిపోతున్నట్లు తెలుసుకున్న ఆయన బాధితులు ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.2.50 లక్షలు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన పోలీసులు డబ్బులు ఇచ్చినట్టు ఆధారాలు ఉంటే సమర్పించాలని బాధితులకు సూచించారు. అయితే కార్యాలయంలోనే నగదు రూపంలో డబ్బులు ఇచ్చామని చెప్పగా, ఆధారాలుంటే తప్ప ఏమీ చేయలేమని చెప్పి గ్రీవెన్స్‌ను క్లోజ్ చేసేశారని బాధితులు చెబుతున్నారు. జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ జగన్మోహన్‌రావు విశ్వమోహన్ రెడ్డికి సహకరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.






# సరికొత్త చరిత్ర..!

## యోగా డేపై సీఎం చంద్రబాబు




(సత్యంన్యూస్, విశాఖపట్నం)

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో నిర్వహించిన యోగా డే విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ యోగాంధ్ర సూపర్ హిట్ అని అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించామని తెలిపారు. 3 లక్షల 3వేల మందికి పైగా అనుకున్న సమయానికి వేదిక వద్దకు చేరుకున్నారని.. ఒకేసారి రెండు గిన్నీస్ రికార్డులు సృష్టించటం ఇదే ప్రథమమని అన్నారు. ప్రజా చైతన్యంతోనే ఈ విజయం సాధించామన్నారు. ప్రకృతి కూడా కరుణించిందని చెప్పారు.

20 రోజుల క్రితం వర్షం పడుతుందని చూపించటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని.. వరుణదేవుడు కూడా కరుణించాడన్నారు. అన్ని దేశాలు గుర్తించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యోగాంధ్రకు విశేష ప్రాచుర్యం కల్పించారని అన్నారు. ఇంత పెద్ద వేడుకను చిన్న ఇబ్బంది కూడా లేకుండా సాంకేతిక సాయంతో విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు.

యోగాంధ్ర పిలుపుతో అర్ధరాత్రి లేచి అన్ని వయసుల వారు వచ్చేశారన్నారు. 26 జిల్లాల్లో 26 థీమ్ బేస్ యోగా నిర్వహించామన్నారు. 100 పర్యాటక ప్రదేశాల్లో అనుకుంటే 101 చోట్ల చేశారని తెలిపారు. లక్షకు పైగా ప్రదేశాల్లో రెండున్నర కోట్లమంది యోగా చేసినట్లు వెల్లడించారు. విశాఖలో 10 ఏళ్ల క్రితం హుద్ హుద్ పరిణామాలను ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. నాడు దీపావళి టపాసులు కాల్చొద్దంటే మానేశారని.. నేడు యోగాకు రమ్మంటే ఉత్సాహంగా తరలివచ్చారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికీ సీఎం అభినందనలు తెలియజేశారు.

11వ అంతర్జాతీయ యోగా డే నిర్వహణపై ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. గేమ్ ఛేంజర్‌గా నిలిచిన ఈ వేడుకకు ఓ లాజికల్ ముగింపు ఇస్తామని తెలిపారు. యోగా వల్ల కుటుంబానికి భారం కాదని, రాష్ట్రానికి భారం కాదని గుర్తించాలన్నారు. డిజిటల్ హెల్త్ కార్డులకు సంబంధించి బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి నూతన ఒరవడిలు సృష్టిస్తున్నామన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుతూ వైద్య ఖర్చులు బాగా తగ్గేలా ఈ ప్రాజెక్టు రూపొందుతోందన్నారు. మంత్రి లోకేష్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం పనితీరు వల్ల ప్రజా చైతన్యం పెరిగిందని ప్రధాని గుర్తించారన్నారు. వాస్తవాలు లేకుంటే ప్రధాని మాట్లాడరని, ప్రధాని ప్రశంసలకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.








అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అంగులాలు (20×60)

- వివరాలకు సంప్రదించగలరు -

9866 222 636


## మనస్సు, శరీరం, ఆత్మను ఒక్కటిగా లయం చేసే ప్రక్రియ యోగ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మనస్సు, శరీరం, ఆత్మ మూడింటినీ ఒక్కటిగా లయం చేసే గొప్ప క్రియనే యోగ అని శ్రీకాకుళం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, రాష్ట్ర లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ (సీఎల్ఈఎస్ఏ) చైర్మన్ ముని శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నారు. అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా కాన్ఫిడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ సర్వేయర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్, క్రెడాయ్ శ్రీకాకుళం చాప్టర్, రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం, జెసిఐ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు రామశంకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో 45 నిమిషాల పాటు 85 మందితో యోగాసనాలు అందరితో వేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, శ్రీకాకుళం క్రెడాయ్ అధ్యక్షులు చక్రవర్తి మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా ఇస్తుందని తెలిపారు. ఇంజనీరు దుంగ సుధాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ యోగా గురువు రామశంకర పట్నాయక్, యోగా సాధకులు భాస్కరరావు, మోహిని, సుప్రీం దివాకర్ యూసఫ్, మల్లేశ్వరరావు, ఉదయలక్ష్మి, నేహ, ఇంజనీర్స్ అసోసియేషన్ నుంచి ఎన్ని జగదీష్, పూజారి బాలచందర్, ఎంఎస్ విజయకుమార్, పృథ్వీరాజ్, కోరాడ దిలీప్, నాగరాజు, జి.రాజేష్, ఎన్ని రాజేష్, ఉదయ్ కిరణ్, రోటరీ క్లబ్ తరపున సంతోష్ దూసి, సూర్య పసగాడ, బరాటం శ్రీనివాస, జైశ్రీరామ్, డాక్టర్ బమ్మిడి సందీప్, మొనంగి మురళీమోహన్, క్రెడాయ్ నుంచి సత్యరావు, పాండురంగారావు, చలపతిరావు, జేసీఐ ప్రవీణ్, ఆరెస్సెస్ నుంచి మాధవ్, వసంతరావు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేశం మొత్తం యోగాడేను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ కొత్తూరు విద్యాశాఖలో మాత్రం తూతూమంత్రంగానే సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాసప కేజీబీవి హాస్టల్‌లో ఎస్ ఓ రాధిక యోగడేని తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తుంది. ఈమెపై పలుమార్లు అధికారులు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. కేవలం ముగ్గురితోనే మమ అనిపించిన దృశ్యాన్ని మీరు చూడవచ్చు. – సత్యంన్యూస్ కొత్తూరు



## వంశధార జల సాధనకై పోస్ట్ కార్డు ఉద్యమం



(సత్యంన్యూస్, పలాస)

మండలం నారాయణపురం పంచాయతీ గ్రామ సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు తీర్మానం కాపీని పోస్ట్‌కార్డులను వంశధార జల సాధన కమిటీ ప్రతినిధులకు అందించారు. గ్రామ పంచాయతీ తీర్మానాలను సర్పంచ్‌ల నుంచి సేకరించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖా మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు పోస్ట్‌కార్డుల ద్వారా తెలియజేస్తామని తెలిపారు. గ్రామాల రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు రైతులు ఉద్దేశించి మాట్లాడుతూ వంశధార సాగునీరు కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని బొడ్డపాడు వేపాడు చెరువు మీదుగా సంకుజోడు, దామోదర్ సాగర్, సునాముడి కాలువలకు సాగునీరు అందించినట్లయితే రైతులు రెండు పంటలు పండించుకోవచ్చన్నారు. ఇచ్ఛాపురం వరకు సాగు నీరు కాలువను పొడిగిస్తే అన్నదాతలు పడిన కష్టానికి వంశధార సాగునీరు అందినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతుల పక్షపాతి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. సమావేశంలో వంశధార జల సాధన కమిటీ ప్రతినిధులు కోర్ల హేమరావు చౌదరి, నల్లహడ్డి, పిడి మందస ఎంపిటిసి వాయులపల్లి మాధవరావు, కుంటికోట సర్పంచ్ డి.వైకుంఠరావు, ధర్మపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

(సత్యంన్యూస్, లావేరు)

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లావేరులో ప్రధానోపాధ్యాయులు పశుపుల జగన్నాధరావు అధ్యక్షతన శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఉదయం 6 నుండి 8గంటల వరకు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పురజనులతో కలిసి సామూహికంగా యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పేడాడ వెంకటరావు, మండల ప్రత్యేక అధికారి ఆర్.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి మజ్జి మురళీకృష్ణ పాల్గొన్నారు.



## యోగాంధ్ర గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించడం సంతోషంగా ఉంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విశాఖ కేంద్రంగా యోగాంధ్ర కార్యక్రమం అద్భుతంగా జరిగిందని, ప్రపంచ దేశాలు విశాఖవైపు చూసేవిధంగా చరిత్రలో నిలిచే పోయేవిధంగా ఈ వేడుకలు నిర్వహించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేడుక యోగాంధ్ర గిన్నిస్‌బుక్ రికార్డు సృష్టించడం గర్వంగా ఉంద న్నారు. యోగాడేకు ప్రజల నుంచి వచ్చిన స్పందన అద్భుతమ న్నారు. ఈ మేరకు శనివారం 11వ అంతర్జాతీయ యోగాదినోత్స వం వేళ విశాఖ సాగరతీరం సందడి వాతావరణం సంతరించుకుంది. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహచర ప్రజాప్రతినిధులతో కలిసి యోగా సనాలు వేశారు. యోగాంధ్ర ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. విశాఖ ఆర్‌కే బీచ్ వద్ద ఐదు లక్షల మందితో యోగాంధ్ర వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సుమారు నెలరోజులు రాష్ట్రవ్యాప్తంగా యోంగాంధ్ర వేడుకలు నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాకంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు ప్రపంచ దేశాలు సైతం విశాఖ వైపు చూశాయన్నారు. విద్యార్థులు, యోగాసాధకులు అధికారులు కృషి అభినందనీయమన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు లక్ష్యంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ప్రపంచ దేశాలకు యోగా ప్రాముఖ్యాన్ని తెలియజేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఇంతటి మంచి కార్యక్రమం ప్రపంచ దేశాలు చూసే విధంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. యోగా వల్ల శాంతి, స్థిరత్వం సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారా లోకేష్, సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని ఠాగూర్ పాఠశాలలో విద్యార్థులు సూర్య నమస్కారాలు ఇతర ఆసనాలు వేశారు. కార్యక్రమంలో యోగ శిక్షకులు పార్వతి, మోహనకృష్ణ, ప్రిన్సిపాల్ బెహరా శ్రీదేవి ఆసనాలు చేయించారు. కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జి ఎస్‌వీ రమణ మాదిగ, కిషోర్‌కుమార్, కె.రామరావు, బి.చిన్నంనాయుడు, ఎస్.ఉమ, కె.వెంకటరమణ, ఎస్.తారక్. వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అప్పర్ ప్రైమరీ, ప్రైమరీ ఇన్‌చార్జెస్ సీతారాం, రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం





ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్షలాదిమంది నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం విమానాశ్రయం చేరుకున్న ప్రధాని మోదీకి శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఘన స్వాగతం పలికారు.

– సత్యంన్యూస్, విశాఖపట్నం

### ప్రతీ ఇల్లు, ప్రతీ విద్యాలయం

## ఓ యోగాలయం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా, యోగాంధ్రలో తన ఇంటినుంచే పాల్గొన్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు తెలిపారు. యోగా అనేది చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకూ అందరూ ప్రతీరోజు యోగా చేస్తే ఆరోగ్యం లభిస్తుందని, మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. యోగా అనేది ఒక్కరోజు కాకుండా నిత్య జీవితంలో ఒక దినచర్యగా అలవాటుగా చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాయోగా కార్యక్రమంలో ఇంటినుంచి తాను కూడా పాల్గొవడం గర్వంగా భావిస్తున్నాను. యోగా శ్వాసను నియంత్రిస్తుందని, మనసును ఉత్తేజపరుస్తుందన్నారు. యోగా ఆరోగ్యానికి ఉచితంగా లభించే మెడిసిన్ లాంటిదన్నారు. యోగా, ప్రాణయామం మనిషికి సంపూర్ణ ఆరోగ్యం ఇస్తుందన్నారు. శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి శుక్రవారం రాత్రి విశాఖకు చేరిన సిక్కోలు వాసుల బస వద్దకు ఎమ్మెల్యే గొండు శంకర్ వెళ్లి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎవరికీ ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఇన్‌చార్జ్‌లను సూచించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.